


***(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)***

123

(11 ' ఫిబ్రవరి 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**ఈ లోకంలో** జీవించడానికి, సిరిసంపదలు, గుణాలు, వస్తువులు, వాసనలు కావాలి. ఏది తక్కువ అయినా, అసలైన జీవితం అనిపించుకోదు. వీటిలో సిరిసంపదల కోసం తాపత్రయం. పడటం ఎక్కువ. అయినా అవి అందరికీ అనుకున్నంతగా అందవు. ఆ సత్యం తెలిసి కూడా బ్రతికి వున్నంతవరకు సిరికోసం పందెం తప్పదు.

పడుతూ, లేస్తూ పట్టు చిక్కినప్పుడు పకపకలాడుతూ చిక్కినప్పుడు పళ్ళు ఇకిలిస్తూ, కోరినంత లభించినప్పుడు బోర్లపడుతూ, మరీ అందని సందర్భాలలో గోడకు జార్లపడుతూ మానవుడు సిరికోసం సతమతమవుతూనే వున్నాడు.

సిరికీ, వరుడికీ పొంతన కలిసి, ఆమె కొందరికి అందమనీ, కొందరికి అందకుండా పారిపొమ్మనీ అందిన వాళ్ళను అహంకారంలో ముంచమని. అందని వాళ్ళను విషాదంలో ముంచమని ఆజ్ఞాపిస్తాడా పన్నగశయనుడు.

ప్రతిరోజూ మనిషి పడే మొదటి తాపత్రయం. ఎదుటివాడి దగ్గరవున్న సిరిని తను ఎలా పట్టుకు జేబులో వేసుకుందామా అనే. కొందరు పట్టిన సిరిని ఇనప పెట్టెలోనో, అనువైన బ్యాంకు ఎక్కౌంటులోనో బంధించి వుంచుకోగలుగుతారు.

కొందరు దొరికిన సిరివలన ఒకసారి వోరగానన్నా చూడకుండానే మీరే ఒకరి జేబుల్లోకి పంపి, పొట్టనింపుకోవడానికి అవసరమైన ఘనతగా భావించి, ఎంతో మురిసిపోతూ వుంటారు.

ఉద్యోస్థులు ముగ్గు వేసుకుని కూర్చుని మంత్రం చదివి, ప్రదక్షిణాలు చేసి, హోం, హ్రీం అంటూ కేకలు పెడితేగాని, వీరి చేతుల్లోకి రావు. దాన్ని తెచ్చి నలుదిక్కులా వెదజల్లితేగాని మూ మూతి ఎంగిలి కాదు. అలాటి వారి జీవితాలలో ఒకసారి కొంటెగా చేసిపోతుంది.

మొన్న ఒక ఇల్లాలంటోంది "నెల్లాళ్ళు గోళ్ళు గిల్లుకుంటూ కూర్చుంటేగానీ ఆ గుప్పెడు రాళ్ళు చేతిలోకి రావు. రాగానే వాటిని వామన గుంటల్లో చింతగింజల్లాగా పదిచోట్ల పారేసి రావడమేగా. అవి మాత్రం అన్నింట్లోకి సరిపోతాయా? వేసినంత వరకు వెయ్యడం చెయ్యి దులుపు కోవడం. పై నెలను తలచుకుంటూ కాలక్షేపం చెయ్యడం అంతేగా" అని.

అది విన్న మరో ఆవిడ వెంటనే అందుకుంది "అలాగ పారేసి వస్తుంటే స్త్రీ చూస్తూ వూరుకుంటే ఎలా? ఏ కొంచెమో తీసి దాచడం నేర్చుకోవాలి. సిరి చింతగింజల్లాగా వెళ్ళి గుంటల్లో పడుతుంటే అర్థాంగి "నంగన్నా" లాగి వుండి కొలత పెట్టాం" అంది.

"అంత సరసం కూడానా అక్కయ్యా?" అని మొదటి ఆవిడ అద్దంలో చూచి మొటిమలు గిల్లుకోవడం ప్రారంభించింది. రెండో ఆవిడ సవరం వూడదీసి పొరుగింటి కొబ్బరి నూనె చక్కగా పూస్తూ కూర్చుంది.

ఉన్న తమాషా ఏమంటే ఉన్నవాడూ లేనివాడూ సిరికోసం పరుగులెత్తడమే. వెర్రిపరుగులు, అర్థంలేని పరుగులు, ఆర్భాటపు పరుగులు. ఎవర్ని చూసినా ముచ్చెమటలు పట్టిపోతూ వుంటాయి. ఎవర్ని చూసినా ఎవరెస్టు శిఖరారోహకులలాగా చూపులు పైన పెట్టుకుని, భూమిని చిన్నబుచ్చాలన్న స్థితిలోనే కనిపిస్తారు. "నిరుటి కన్నా ఈ సంవత్సరం మీ సంపాదన కొంచెం పెరిగిందిగా. అయినా అంతగా చింతాక్రాంతులు కావడమేమిటి?" అని ఒకరిని ప్రశ్నిస్తే "ఏం పెరిగింది. యాభై రూపాయలు పెరిగింది. జీవితంలో ఎన్ని వస్తువులు, ఎన్ని సరదాలు తొలగించుకుని బ్రతుకుతూ వచ్చామో తెలుసా యాభైతో "శుభోదయం" అంటూ గంతులు వేయడానికి సాధ్యమా."

"యాభై ఎక్కువ వస్తున్నాయిగాని పది రూపాయల బొగ్గులు ఎక్కువ కొని, రెండు పూటలా వేడి అన్నం తిందామనుకుంటున్నా పదహారు సంవత్సరాలనుంచీ రాత్రిపూట చద్దన్నమే. ప్రొద్దుటి పులుసే.

పదేళ్ళనుంచి దరిస్తున్న గళ్ళ లుంగీలు మాని, రెండు తెల్ల లుంగీలు, ఇస్త్రీ చేయించి కట్టుకుందామని నేను నిశ్చయించాను. మా ఆవిడ మరో నాలుగు క్రొత్త చీరలు కొనుక్కోవాలనీ, రోజూ ఒక బేడపువ్వులు తలలో ధరించాలనీ ఉబలాటపడుతోంది. ఇక కనీసపు కోర్కెల్లో చిట్టచివరి కోర్కెలు" అన్నాడాయన.

ఈ నాడు కోర్కెలు బ్రతుకునిండా 'ఇంటూ మార్కులు' పెట్టుకుంటూ పోతుంటే వాటిని చెరిపి వెయ్యడానికి దారిన సొమ్ములేని ఎంతమంది ప్రజలు దీనాతిదీనమైన స్థితిలో ప్రొద్దులు త్రోసిపుచ్చుతున్నారో చెప్పడం కష్టం.

సరి ఇలా కొందరినే ఎందుకు వరిస్తుందో, కొందరిని ఎందుకు నిషేదించి పోషణ కూడా చెయ్యకుండా విడిచిపెడుతుందో తెలుసుకోవడం కష్టం "ఈ రహస్యం బయటపెట్టవమ్మ తల్లీ అంటే హాస్యంగా నవ్వుతూ చక్కాపోతుంది. గానీ, నిలబడి నిజం చెప్పదుగదా!" అని ఒకాయన వేదనపడ్డాడు.

"కొందరికి సిరి - కొందరికి కరి" అనే సామెతను ఆమె. ఎల్లవేళలా సత్యం చేస్తూనే వుంటుంది.

"ఏమమ్మా ఈ మధ్య మరీ అలా వున్నారు. ముఖంలో రంగు కూడా వెలిసిపోతోంది" అని ఒకావిడ ఎరుగున్న మరో ఆవిణ్ణి అడిగిందిట.

"వెలిసిపోక ఏం చేస్తుంది. పెట్టెలో సొమ్ముంటే ముఖంలో వెలుతురు జిమ్ముతుంది. సిరి దూరమైతే చీకటి క్రమ్ముతుంది. అంతేగా జీవిత సౌభాగ్యం?

"సహజంగా ఎవరికి ఎంత కళవున్నా సిరిలేందే చచ్చుపడిపోతుంది. లచ్చలేని బ్రతుకులు పుచ్చిపోయిన కాయలు" అని వూరికే అన్నారా పెద్దలు" అని ఆవిడ పరమ వేదాంతం బోధించిందిట.

దేశంలో "సమాన ఆర్థిక ప్రతిపత్తి" అనే నినాదం మార్మ్రోగుతోంది. దారిద్ర్య దేవతపై యుద్ధం సాగించి, విజయం సాధించడానికి పంచవర్ష ప్రణాళికలు దుందుభులు మ్రోగిస్తున్నాయి. సంతాన నిరోధ సూత్రాలు జనాభా రద్దీ తగ్గించడానికి పరుగులు సాగిస్తున్నాయి. "గింజకు పదిరెట్లు గింజలు" అనే ఆశయాన్ని సాధించడం కోసం రైతుల మనస్సులు తూగిస్తున్నారు.

కానీ ఆర్థిక ప్రతిపత్తి విషయంలో ఇంకా ఫలితాలు అందలేదు. రామయ్య డొక్క పూలదండుగా వుంది. రంగడి డొక్క డోలు వాయిస్తూనే వుంది. ఆర్థిక ప్రతిపత్తి విషయం ఆలోచిస్తే.

వత్తి చెయ్యడానికి ప్రత్తివుంది గాని వెలిగించడానికి చమురు చుక్క లేదన్న సామెతగానే వుంది. వీడికళ్ళు గుంటలు పడిపోతున్నాయి. రవంత వెలుతురు జ్యోతిగా వెలగడానికి కరువైపోయింది. మరి సిరికోసం ప్రాకులాడటం ఎలా తప్పుతుంది. ఆమె చిలిపి గంతులు మాని, అందరి గృహాల్లో సమానంగా సంచరించాలని ఎప్పుడు తెలుసుకుంటుందో. అలా చేస్తే లోకువై పోతాననుకుంటున్నదేమో, ఆరాధన కావాలి ఆవిడగారికి. పట్టిపట్టి సాధనలెన్ని చేసినా లాభం లేదు.

సిరితో పాటు ధరలు పెరుగుతున్నాయి. ప్రతివస్తువుకూ. అది ఆవిడకు చిన్నతనం కాదు. తన విలువ తరగడం ఎలా సహిస్తుందో. వివాదాలతో లాభంలేదు. లక్ష్మి తన గుణం మార్చుకోవాలి కొంతవరకైనా ధరలు పడగొడితే కొంతవరకు ఆవిడ పరువు నిలుస్తుంది.

మొన్న విశ్వనాధవారన్నారు - గౌరవ బిరుదులివ్వడం కంటె, మిరపకాయల ధరలు తగ్గిస్తే ఎంతో సంతోషించవచ్చునని.

Post your comments